19022025-DIS-04_Layout 1 2/19/2025 3:38 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# కేసీఆర్ విజయ దుందుభి

*కొందరు అల్పబుద్ధులకు నిజం నచ్చకపోవచ్చు. అద్దం అబద్ధం చెప్పదు. లెక్కలు రోజుకో వేషం వెయ్యవు. రెండు రెండ్లు ఎప్పుడూ నాలుగే. కేసీఆర్ అనే మూడక్షరాలు తెలంగాణ సాధించిన ఘనచరిత్రకు ఆనవాలు. పదేండ్ల ప్రగతి పరుగులకు చేవ్రాలు. అద్దాల మేడల్లో కులుకుతున్న రాజకీయ మరుగుజ్జులు అజ్ఞానంతో రాళ్లు విసురుతున్నారు. పిదపబుద్ధులు అహంకారంతో పేలుతున్నారు. కేసీఆర్ అనే పేరు వారికి నిత్య పారాయణం. పొద్దున లేస్తే ఆ పేరు చెరిపేస్తా, మరిపిస్తా అని కుప్పిగంతులు. పాపం వారిది వైరభక్తి. కేసీఆర్ నామజపం లేకుండా వారికి పూటైనా గడవదు. వారు ఎంతగా వాచాలత చూపిస్తుంటే కేసీఆర్ అంతగా బలపడుతున్నారు. ఈ గడ్డ మీద ప్రజాభిమానంలో ఆయనకు ఆయనే సాటి అనిపించుకుంటున్నారు. ఆయన పదేండ్ల పాలనను జనం పదేపదే గుర్తు చేసుకుంటున్నారు. చివరికి సర్కారు స్వయంగా వెల్లడించిన గణాంకాలూ కేసీఆర్‌కే జై కొడుతున్నాయి. ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన గణాంక నివేదిక 2024 అందుకు తాజా ఉదాహరణ.*

*బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధిలో రాష్ట్రం వేసిన అంగలకు అదివి టీ పట్టింది. రాష్ట్ర సాధకుడే ప్రగతి రథ చోదకుడైతే, అందునా అద్వితీయ దార్శనికుడైతే ఫలితాలు ఎలా ఉంటాయో చెప్పేందుకు ఇదొక ఉదాహరణ. స్వరాష్ట్రం సాధించి కేసీఆర్ పరిపాలనా పగ్గాలు చేపట్టిన 2014 ప్రాంతం నుంచి 2024 మధ్యన గల పదేండ్ల కాలంపై తెలంగాణ ప్రణాళికా విభాగం రూపొందించిన నివేదిక అందుకు అద్దం పట్టింది. రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఆ నివేదికను విడుదల చేశారు. ఆ పదేండ్లలో రాష్ట్ర జీఎస్డీపీ దాదాపు 200 శాతం పెరుగుదల నమోదు చేసింది. తలసరి ఆదాయం జాతీయ తలసరిలో రెట్టింపైంది. సాగుకు సంపూర్ణంగా అండదండలు అందించి దండుగన్న వ్యవసాయాన్ని పండుగలా మార్చారు కేసీఆర్. ఆయన నేతృత్వంలో పంటల విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుంచి 2023-24 నాటికి 2.09 కోట్ల ఎకరాలకు పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక కేసీఆర్ విజయ గీతికలా తయారవడం విశేషమే మరి.*

*ఇవన్నీ బీఆర్ఎస్ ప్రచార విభాగం విడుదల చేసిన లెక్కలు కావు. పదేండ్లలో అభివృద్ధి జరిగింది. అది దేశవ్యాప్తంగా మన్ననలు అందుకున్నది. విశ్వవీధుల్లో విజయ పతాకను ఎగరేసింది. నామరూపాల్లేకుండా చేస్తాం, బహిష్కరిస్తాం అని ఎగిరెగిరి పడుతున్నవారికి ఈ లెక్కలు గొంతులో పచ్చి వెలక్కాయలే. ఆకాశం మీదకు దుమ్మెత్తి పోయాలనుకునే నోటి దురుసు వీరులకు భంగపాటే. కేసీఆర్ వైభవోజ్వల పాలనకు మసిపూయాలనుకునే వారికి ఈ నివేదిక ఓ చెంపపెట్టు. తెలంగాణ నిలిచి గెలిచింది. ఆ కీర్తి కిరీటం కేసీఆర్‌కు కాక మరెవరికి దక్కుతుంది? కేసీఆర్ మా నేత.. అభివృద్ధి ప్రదాత అని గుండెల్లో నిలుపుకొన్న ప్రజలను అడిగితే తెలుస్తుంది. చెరిపేస్తే చెరిగిపోయేందుకు కేసీఆర్ అనేది గోడమీది రాతకాదు. శిలాక్షరం. సువర్ణాక్షరం. కేసీఆర్ మార్గనిర్దేశకత్వంలో తెలంగాణ సాధించిన అభివృద్ధి నికార్సైనది. ఇది దాచేస్తే దాగని సత్యం. కేసీఆర్ జన్మదిన సంబురాలు జరుపుకొన్న ప్రజలే అందుకు నిదర్శనం. నిప్పులాంటి ఆ సత్యం జయిస్తుంది అనునిత్యం.*

# భావోద్వేగాల వేదిక ఎర్రవెల్లి

'అంజన్నా... గమనించినవానే వొచ్చిన జన జాతరలో తొంబై శాతం మంది యువతనే' అని ఓ జర్నలిస్టు ప్రతినిధి నిన్న కేసీఆర్ ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో నాతో అంటుండగనే ఒక్కసారి తలుపు ఊడిపోయిన శబ్దం వచ్చింది. ప్రధాన ద్వారం వైపు వెళ్లి చూస్తే గుండెల నిండా అభిమానంతో ఊగిపోతున్న నవతరం కనిపించింది. అప్పటికే రాత్రి 8 గంటల సమయం దాటిపోతున్నది. ఉదయం మొదలైన జన ప్రవాహం ఆగటమే లేదు. ఏం చేసైనా సరే కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపే తిరిగివెళ్లాలని, ఆయనతో ఫొటో దిగడానికి ఎవరితోనైనా యుద్ధానికి కూడా సిద్ధపడే వచ్చారని చూసిన వారెవరికైనా అర్థమౌతున్నది. ప్రధాన ద్వారాన్ని విరగొట్టి, ఆపే ప్రయత్నం చేస్తున్న పార్టీ నాయకులతో గొడవ పడుతూ పెద్ద సార్‌ను ఎలాగైనా కలిసి తీరాల్సిందేనని వారంతా పడుతున్న తాపత్రయం చూస్తుంటే ఆశ్చర్యం వేసింది.



**డాక్టర్ ఆంజనేయ గౌడ్**



ఆ క్రమంలో 'ఎప్పుడు మీరే సార్ చుట్టూ ఉంటారా..?, మమ్మల్ని కలువనియ్యరా?' అని ఆవేశంగా అరుస్తూ, ఆపే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుల మీదికి దాడి చేసినంత పని చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఓ గమ్మత్తు సంఘటన జరిగింది. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రెండు చేతులు జోడించి 'బాబు మీకు దండం పెడతా, ఊపిరి ఆడటం లేదు, బయటకు వెళ్లండి' అని మొక్కారు. అప్పుడు వెంటనే ఒక యువకుడు ప్రశాంత్‌రెడ్డి పాదాలపై సాష్టాంగపడి, 'అన్నా... ఎట్లనన్న ఈ రోజు సార్‌ను కలవాలె, ప్లీజ్ నన్ను ఆపొద్ద'ని అరవడంతో ఏం చేయాలో తోచక మాజీ మంత్రి మౌనం దాల్చాడు. కొంతమంది దంపతులైతే వారి చిన్నారులను వెంట తీసుకొచ్చి, సార్‌తో ఫొటో దింపించడం కోసం, ఆశీస్సులు ఇప్పించడం కోసం తపనపడుతున్నారు. కేసీఆర్‌ను కలిసిరాగానే వెంటనే ఆ ఫొటో కావాల్నని ఫొటో తీసినవారి వెంటపడి తరుముతున్నారు. ఇలా ఎన్నెన్నో భావోద్వేగాలకు, అభిమానావేశ సన్నివేశాలకు నిన్న ఎర్రవెల్లి వేదికగా మారింది. ఊర్ల నుంచి ఉప్పెనలా కదిలివచ్చి, మమకార మహోత్సవంలో కదం తొక్కారు.

మిట్ట మధ్యాహ్నం ఊగిపోతున్న వేల మందిని కలుస్తూ, వారితో ఫొటోలు దిగుతూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గంటల పాటు శాంతపరిచేందుకు చేసిన ప్రయత్నాలు కూడా పెద్దగా ఫలించలేదు. చొక్కాలు చిరుగుతున్నా, చెమటతో తడిసి ముద్దవుతున్నా చల్లబడటం లేదు. వాళ్లు వెనుతిరిగే ఆలోచనే చేయడం లేదు. గుంపులు గుంపులుగా గంటల తరబడి నిలబడే నినాదాలిచ్చారు. జిందాబాద్‌లతో వ్యవసాయ క్షేత్రంలో ప్రేమను పండించారు. పెద్దసార్‌ను కలిసేందుకు గంటల కొద్దీ ఎదురుచూస్తూనే, చర్చల్లో మునిగితేలుతున్నారు. ఆ ముచ్చట్లపై కూడా చెవి వేసిన మాకు 'అరేయ్ కొడుకులు, కేసీఆర్ ఫాంహౌస్ మీద అదీ, ఇదని ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసింద్రురా, ఏముందిరా ఇక్కడ' అని గట్టిగా ఆవేశంతో మాట్లాడుకుంటున్న మాటలు వినపడుతున్నాయి. 'ఫామ్‌హౌస్ మీదనే కాదు, మొత్తం మోసపు మాటలే చెప్పి ముంచేసింద్రు గా.. కొడుకులు' అంటూ రాయలేని భాషలో కాంగ్రెస్ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. అభిమానం, ఆనందం.. ఇలా సకల భావోద్వేగాల సంబురానికి ఎర్రవెల్లి వేదికైంది. తరలివచ్చిన వేల మందిలో ఖద్దరు చొక్కాలు కొన్నే కానీ, మామూలు చొక్కాలెన్నో... మొత్తం సామాన్య నవతరమే.

వాస్తవానికి అధికారానికి దూరమై సుమారు ఏడాదిన్నర కావొస్తున్నది. ఈ 15 నెలల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై, కేసీఆర్ కుటుంబంపై రేవంత్ సర్కార్ ఎంత విషం కక్కిందో కదా..? బ్లేమ్ గేమ్‌నే గవర్నమెంట్ పాలసీగా మార్చుకొని, క్యాబినెట్ మొత్తం విషపు నాలుకలను బయటేసుకొని ఊరేగడం చరిత్రలోనే బహుశా ఏ రాష్ట్రంలో జరిగి ఉండదు. పాలనా వ్యవస్థలను ఉసిగొల్పి, ప్రధాన మీడియాను నోటికి తొడుక్కొని సర్కారే నిత్యం అబద్ధాలతో దాడికి దిగింది. నీళ్లల్లో విషం కుమ్మరించాలని, విద్యుత్తు వెలుగులపై అసత్యాలను ఆరవేయాలని ప్రభుత్వం పడరాని పాట్లన్నీ పడ్డది. గల్లీ నుంచి ఢిల్లీ దాకా సందర్భం, సమావేశమేదైనా కేసీఆర్‌పై విష ప్రచారానికే రేవంత్ సర్కార్ వాడుకున్నది. కేసీఆర్ చరిత్రలో కొసరంతకూ చేరువయ్యే చేవలేక, బీఆర్ఎస్ ప్రభుత్వ పనితనానికి ఏ కోణంలోనూ పోటీ పడలేక, పరనిందనే విధానంగా రేవంత్ సర్కార్ సుమారు ఏడాదిన్నర కాలాన్ని ఎల్లదీసింది. ఈ దుర్మార్గమైన పాలనను ఎదిరించాల్సిన బీజేపీ దిగజారి, కాంగ్రెస్ కుట్రాజకీయానికి బహిరంగంగానే దండలేసి వంతపాడుతున్నది. రెండు జాతీయపార్టీలు ఒక్కటై తెలంగాణకు, కేసీఆర్‌కు మధ్య బంధాన్ని వధించాలని ఎన్నో పన్నాగాలు పన్నారు. అసలుకు ఆకాశమే హద్దుగా హస్తం, కమలం పార్టీలు కలిసి నిలబెట్టిన అబద్ధాల దెయ్యం ముందు కేసీఆర్ కాకుండా మరొక నాయకుడైతే జనానికి దూరమైపోయేవాడు.

కానీ, తెలంగాణకు గుండె ధైర్యంగా గులాబీ జెండాను అందించడంతో పాటు, పంజరం నుంచి విడిపించి, ఎగరేసిన తెల్ల పావురంలా, తెలంగాణకు స్వేచ్ఛా రెక్కలు సమకూర్చిన కేసీఆర్, ప్రజారాశుల అనుభవంలో ప్రగతిశీల మార్పునకు కారణమయ్యారు. ప్రభుత్వ పాలనావ్యవస్థకు విప్లవాత్మకతను జోడించి, గ్రామీణ ఆర్థికవ్యవస్థకు భిన్న పార్శ్వాల రాబడిని సుస్థిరం చేశారు. అన్ని రంగాల్లో అభివృద్ధినే కాదు, నూతన దృక్పథాన్ని వెలిగించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు. అందుకే, కేసీఆర్ కారణజన్ముడయ్యారు. పదవులకు అతీతమైన ప్రజా రాశులందరి ప్రేమను పొందారు. అందుకే నిన్నటి కేసీఆర్ జన్మదిన వేడుకలు ప్రతి గ్రామంలో ప్రజా వేడుకలయ్యాయి.

**(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)**



# 'న్యాక్' గుర్తింపు కోసం అడ్డదారులు

**ప్రపంచీకరణ నేపథ్యంలో విద్య వ్యాపార వస్తువుగా మారిపోయి అతిపెద్ద వ్యాపార పరిశ్రమగా రూపాంతరం చెందింది. మొదట్లో ప్రైవేటు విశ్వవిద్యాలయాల పేరుతో కొందరు వ్యాపారస్తులు విద్యా సంబంధమైన సేవలను తమ దుకాణాల ద్వారా నేరుగా అమ్మకానికి పెట్టారు. మరి కొందరు వీటి అనుబంధ సంస్థగా గుర్తింపు పొంది పరోక్ష వ్యాపారానికి తెరతీశారు. విదేశీ విశ్వవిద్యాలయాలు కూడా ఇక్కడి విద్యార్థులను దోచుకోవడానికి సిద్ధమయ్యాయి. విద్యార్థిని ఒక వినియోగదారుడిగా గుర్తించిన ఈ నయా విశ్వవిద్యాలయాలు తమ వినియోగదారుడిని అన్ని విధాల సంతృప్తి పరచడానికి అడ్డదారులు తొక్కడం మొదలుపెట్టాయి.**

విద్య అనేది వాణిజ్య వస్తువు కాదని, దాన్ని బహిరంగ మార్కెట్లో అమ్మకానికి పెట్టడం నేరమని సుప్రీంకోర్టు గతంలో అనేక తీర్పులు ఇచ్చినప్పటికీ విద్యా వ్యాపారవేత్తల తీరు మారడం లేదు. సామాజిక అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం విద్య ఎంతో ఉపయోగపడుతుందని మన ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా పరోక్షంగా ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నారు. విద్యా వ్యాపారులు తమ ధన దాహాన్ని తీర్చుకోవడానికి తమ విద్యా సంస్థలు చాలా గొప్పవని చూపిస్తూ, ఫీజులు పెంచడానికి, తమ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లడానికి అనేక ఎత్తుగడలతో పర్యవేక్షణ అధికారులను బురిడీ కొట్టించడం పరిపాటిగా మారింది.

**ప్రైవేట్ రంగంలో యూనివర్సిటీల స్థాపనకు ప్రభుత్వాలే నిబంధనలను సడలించి రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలుకుతుండటంతో యూనివర్సిటీల స్థాపన సులువైంది. కానీ వాటికి అకడమిక్‌గా గుర్తింపు రావడానికి న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్)ను లోబరుచుకునేందుకు ప్రైవేట్ సంస్థలు కొత్త ఎత్తుగడలు వేస్తున్నాయి. ఇందుకు కావలసిన రంగాన్ని సిద్ధం చేయడంలో కేంద్ర ప్రభుత్వం తలమునకలైంది.**

అందులో భాగంగానే కేంద్రీకృత వ్యవస్థను స్థాపించడం, 1956లో పార్లమెంటు చట్టం ద్వా రా ఏర్పడిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నిక ల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ), నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్ టీ), మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) లాంటి సంస్థలను రద్దు చేసి, హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా స్థాపన లాంటి ప్రతిపాదనలను ముందుకు తెస్తున్నది. ఏక కేంద్ర నియంత్రణ వ్యవస్థలోని అధికారుల నియామకాల్లో అక్రమ మార్గాన చొరబడటానికి కావలసిన రంగాన్ని నూతన జాతీయ విద్యా విధానం సిఫార్సుల రూపంలో కావలసిన ఏర్పాటు చేస్తున్నది. అందుకే 'యూనివర్సిటీలు, కాలేజీలలో టీచర్లు, అకడమిక్ సిబ్బంది నియామకం, ప్రమోషన్ ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణకు కనీస అర్హతలు' పేరిట కొత్త నిబంధనల ముసాయిదా పేరుతో అధ్యాపకులు, వైస్ ఛాన్సలర్ల నియామకాల్లో యూజీసీ సడలింపులను తీసుకొస్తున్నది. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ అనుకూల రాజకీయ అభిప్రాయాలు ఉన్న వ్యక్తులు విశ్వవిద్యాలయ బోధన పోస్టుల్లో చొరబడవచ్చు. ఎటువంటి అధ్యాపక బోధనా అనుభవం లేకుండా వీసీలుగా అవతారం ఎత్తవచ్చు. ఈ నేపథ్యంతో అక్రెడిటేషన్ కౌన్సిల్ వంటి వాటిల్లో చొరబడవచ్చు. తద్వారా ప్రైవే టు విద్యా సంస్థలు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు మేలు జరిగే నిర్ణయాలు, సూచనలు చేయ డం, సందులో సడేమియా లాగా కొంత సొంత లాభం చూసుకోవచ్చు. అదే కేఎల్ యూనివర్సిటీ కుంభకోణం!

జాతీయ అంచనా, మదింపు మండలి (న్యాక్) గుర్తింపు, గ్రేడింగ్ పెంచుకునేందుకు రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కళాశాలలు, యూనివర్సిటీలు అడ్డదారులు తొక్కుతున్నాయి. కమిటీ సభ్యులకు పెద్ద మొత్తంలో డబ్బు ఎరవేసి ఉత్తమ గ్రేడింగ్ కోసం ప్రయత్నిస్తున్నాయి. కొన్ని యాజమాన్యాలు ఇంకాస్త ముందుకెళ్లి తప్పుడు పత్రాలు సృష్టించడం, అధ్యాపకులు, ఆచార్యులు లేకున్నా ఉన్నట్టుగా చూపడం వంటి అవకతవకలకు పాల్పడుతున్నాయి. విద్యా సంస్థల్లో బోధనా సిబ్బంది సరిపడా ఉన్నారా? వారి విద్యార్హతలు విద్యాసంస్థలు ఆన్‌లైన్‌లో పంపిన సమాచారం ప్రకారం ఉన్నాయా? తదితర అంశాలను క్షేత్రస్థాయి తనిఖీలకు వచ్చే న్యాక్ కమిటీ పరిశీలిస్తుంది. నిబంధనల ప్రకారం 30 శాతం వెయిటేజీ పాయింట్లు ఇచ్చే వెసులుబాటు కూడా ఈ కమిటీ చేతుల్లో ఉంటుంది. ప్రముఖ పరిశ్రమ సంస్థలతో ఒప్పందాలు ఉన్నట్టు కొన్ని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రైవేట్ యూనివర్సిటీల యాజమాన్యాలు ఫోర్జరీ పత్రాలు సమర్పించి న్యాక్ గుర్తింపును మరింత పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

**గ్రేడ్ల కోసం తద్వారా వచ్చే ఆర్థిక లాభాల కోసం ప్రైవేటు యాజమాన్యాలు ఎంతకైనా తెగిస్తాయనేది వాస్తవం. నాసిరకం విద్యాసంస్థలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్లు దక్కడమే ఇందుకు నిదర్శనమని నిపుణులు చెప్తున్నారు. న్యాక్ కమిటీ సభ్యులకు లక్షల రూపాయలు ముట్టజెప్పినట్టు సీబీఐ గుర్తించి కేసులు నమోదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. న్యాక్ గుర్తింపు ఉంటే ఆ కళాశాలలో ప్రమాణాలు బాగున్నట్టు లెక్క! న్యాక్ గుర్తింపు ఉంటే యూజీసీ నుంచి స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా వస్తుంది.**

అటానమస్ హోదా దక్కితే సొంతంగా పరీక్షలు నిర్వహించుకోవచ్చు. ఆ సదుపాయం ఉంటే విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో డొనేషన్లు, ఫీజులు వసూలు చేసుకునే అవకాశం యాజమాన్యాలకు లభిస్తుంది. విదేశీ వర్సిటీల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్నప్పుడు కూడా ప్రామాణికంగా కళాశాల న్యాక్ సర్టిఫికెట్‌ను అడుగుతున్నారు. కొన్ని కంపెనీలు ప్రాంగణ నియామకాలకు, వేతన ప్యాకేజీలకు కూడా దీనిని పరిగణనలోనికి తీసుకుంటున్నాయి. 'జాతీయ విద్యా విధానం-2020' అమలు మాటున ప్రపంచ బ్యాంకు షరతులు అమలు చేసేందుకు ప్రభుత్వాలు యత్నిస్తున్నాయి. భారతదేశ విద్యా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసే విధంగా సంస్థలు అనుకూలమైన అక్రెడిటేషన్, రేటింగ్‌లను కొనుగోలు చేయగలిగితే, విద్యార్థు లు మోసపోతారు. విద్యా ప్రమాణాలు తారుమా రు అవుతాయి. కాబట్టి ఈ మార్పులకు అవకా శం కల్పించే ప్రభుత్వాల విధానాలను ప్రశ్నించే చైతన్యాన్ని విద్యాభిమానులు, అధ్యాపకులు, పౌర సమాజం ప్రజల్లో పెంపొందించాలి.



**కె. వేణుగోపాల్**
**98665 14577**

**(వ్యాసకర్త: పూర్వ అధ్యక్షులు, ఏపీటీఎఫ్)**

# వైటీపీఎస్.. కేసీఆర్ వేసిన వెలుగుబాట

**'అభివృద్ధి' అనే అంశం రాజకీయాలకతీతంగా, నిరంతరంగా కొనసాగాల్సిన ప్రక్రియ. అది కొరవడినప్పుడు ప్రజలు పరాజితులుగానే మిగిలిపోతారు. ఈ సత్యాన్ని గుర్తించింది కాబట్టే గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్తు రంగంలో విప్లవాత్మక విజయాలను సాధించింది. అందులో భాగంగానే యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)ను నిర్మించింది. ఇది దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు కేసీఆర్ హయాంలో 90 శాతం పూర్తికాగా ఇప్పుడు వినియోగంలోకి వచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు విద్యుత్తును వినియోగించుకోనున్నారు. ఇది శుభపరిణామం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుకున్నట్టుగా ప్రస్తుత ప్రభుత్వం నిర్వహిస్తే రాబోయే వేసవికాలంలో విద్యుత్తుకు కొరత ఉండదు. చూద్దాం... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను విజేతలుగా నిలుపుతుందో లేదా పరాజితులుగా చరిత్ర పుటల్లోకెక్కిస్తుందో...!**



**తుల్జారాం సింగ్ ఠాకూర్**
**78930 05313**



**2035** నాటికి తెలంగాణ రాష్ట్రం 31,891 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్‌తో విద్యుత్తు వినియోగంలో అతిపెద్ద రాష్ట్రంగా ఆవిర్భవించనున్నదని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఇటీవలి తన నివేదికలో పేర్కొన్నది. దక్కన్ పీఠభూమిలో భౌగోళికంగా కీలకమైన తెలంగాణలో అభివృద్ధి శరవేగంతో కొనసాగుతుండటమే అందుకు ప్రధాన కారణం. తెలంగాణ రాష్ట్రం అవతరించిన 2014, జూన్ 2 నాటికి కేవలం 6,667 మెగావాట్ల డిమాండ్ ఉండగా తదనంతర దశాబ్ద కాలంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాల మూలంగా ప్రస్తుత రాష్ట్ర విద్యుత్తు డిమాండ్ 15,856 మెగావాట్లుగా ఇటీవల నమోదైంది. రాబోయే వేసవికాలంలో డిమాండ్ 18 వేల మెగావాట్లకు చేరుకోవచ్చని ఒక అంచనా.

రాష్ట్ర అవతరణ తర్వాత విద్యుత్తు రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి ఉత్పత్తి, రవాణా, పంపిణీ రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించడం గమనించవచ్చు. దేశంలోనే అన్ని వర్గాల వినియోగదారులకు వాణిజ్య, పారిశ్రామిక, గృహ వాడకందారులకే కాకుండా వ్యవసాయ రంగానికీ 24 గంటల నిరంతర విద్యుత్తును అందించడం అద్భుతమైన ముందడుగు. వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్ది, పారిశ్రామిక, ఐటీ, ఫార్మా, వాణిజ్య, సైన్స్ తదితర రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంలో భాగంగా విద్యుత్తు రంగాన్ని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రచించి, నిధులు కేటాయించి అభివృద్ధి పథాన నడపడంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కృతకృత్యులయ్యారు. అందులో భాగంగానే 1,080 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్, 800 మెగావాట్ల కొత్తగూడెం ఏడవ స్టేజీ ప్లాంటు, 800 మెగావాట్ల కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులను పేర్కొనవచ్చు. యాదాద్రి ప్రాజెక్టును ఒకే స్థలంలో నిర్మించింది. ఇది దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బీహెచ్‌ఈఎల్ భాగస్వామ్యంతో నిర్మితమవుతున్న వైటీపీఎస్ నిర్మాణ వ్యయం ఎక్కువగా ఉండటం, బీహెచ్‌ఈఎల్‌కు నామినేషన్ పద్ధతిలో కేటాయించడం తదితర కారణాల రీత్యా రాబోయే కాలంలో ప్రజలకు గుదిబండగా మారనున్నదని ఆరోపిస్తూ ప్రస్తుత ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది.

**నల్లగొండ జిల్లా దామరచర్లలో సుమారు 4,676 ఎకరాల సువిశాల ప్రదేశంలో 25099.42 కోట్ల అంచనాలతో ఐదు 800 మెగావాట్ల యూనిట్లు నెలకొల్పడానికి సంకల్పించగా, రెండో యూనిట్ 2025, జనవరి 25 నాడు వాణిజ్య కార్యకలాపాలతో పూర్తిస్థాయిలో పనిచేస్తున్నది. మొదటి యూనిట్ ఇప్పటికే సింక్రనైజేషన్ ప్రక్రియను పూర్తిచేసుకొని, వచ్చే మార్చిలో పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నది. పనులన్నీ అనుకున్న ప్రకారం వేగవంతంగా పూర్తి చేసుకున్నట్టయితే మిగతా మూడు యూనిట్లు 2,400 మెగావాట్ల పూర్తి సామర్థ్యం విద్యుత్తు 2026 మార్చి నాటికి ప్రజలకు అందుబాటులోకి రావచ్చు.**

అంతేకాకుండా గత ప్రభుత్వం విద్యుత్తు రంగానికి విశేషమైన ప్రాధాన్యమిచ్చి అప్పటికే వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న కాకతీయ థర్మల్ పవర్ ప్లాంటును కేటీపీపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి 2016, జనవరిలో వాణిజ్య కార్యకలాపాల దిశగా పూర్తిస్థాయిలో సింక్రనైజేషన్ చేసింది. ఈ ప్లాంటుతో పాటు నిర్మాణ పనులు ప్రారంభించుకున్న రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్ (ఆర్‌టీపీపీ)పూర్తికావడానికి 2018, డిసెంబర్ వరకు వేచి చూడాల్సి వచ్చింది. కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కేటీపీపీ)కు సంబంధించిన బాయిలర్, టర్బైన్, జనరేటర్ పనులు బీహెచ్‌ఈఎల్ చేయగా బ్యాలెన్స్ పనులు చేయాల్సిన కాంట్రాక్టర్లతో ఉన్న పేచీలన్నింటినీ పరిష్కరించి పనులు పూర్తవడానికి నాటి ప్రభుత్వం, యాజమాన్యం విశేష కృషి చేసింది.

కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ ఏడవ దశ 800 మెగావాట్లు దేశంలో రికార్డు సమయంలో పనులు పూర్తిచేసుకొని ఉత్పత్తి ప్రారంభించడం విద్యుత్తు రంగంలోనే సంచలనం. 60 నెలల కాలపరిమితి ఉండగా, కేవలం 48 నెలల సమయంలోనే సీవోడీ పూర్తిచేసుకోవడం తెలంగాణ జెన్‌కో సాధించిన అపూర్వ విజయం. ఇదిలా ఉంటే 2025, ఫిబ్రవరి 13 నాడు తెలంగాణ జెన్‌కో రామగుండంలో 800 మెగావాట్ల కొత్త థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి డీపీఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను ఆమోదించింది. రామగుండంలో 62.5 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం (బీస్టేషన్) కాలం చెల్లడంతో గత సంవత్సరం మూసివేశారు. అదే స్థలంలో కొత్తగా 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి పూనుకున్నారు. పాత స్టేషన్‌కు సంబంధించిన మూడు వందల ఎకరాలు అందుబాటులో ఉండటంతో అక్కడి సింగరేణి అనుకున్న ప్రతిపాదిత ప్లాంట్‌ను కేవలం జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించడానికి నిర్ణయించారు. ఆమోదించిన డీపీఆర్ ప్రకారం 800 మెగావాట్ల ప్రతిపాదిత ప్లాంటుకు రూ.13,331 కోట్లు ఖర్చవుతాయనే అంచనాలున్నాయి. అంటే ప్రతీ మెగావాట్‌కు రూ.16.60 కోట్లు అన్న మాట. దేశంలోనే ఇంత వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు లేకపోగా అంచనా వ్యయం ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులతో పోల్చిచూసినప్పుడు చాలా ఎక్కువగా ఉన్నదని నిపుణుల అభిప్రాయం. ఈ నేపథ్యంలో ఈ ప్రతిపాదిత థర్మల్ కేంద్రం చేపట్టడానికి ప్రభుత్వం అంగీకరించిన పక్షంలో యూనిట్ కరెంట్ ధర రూ.8.18 పైసలుగా డీపీఆర్‌లో పేర్కొనగా, ఉత్పత్తి ప్రారంభమయ్యే నాటికి రూ. 9 నుంచి 10 వరకు చేరుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు. కోల్ లింకేజీని డొమెస్టిక్ దేశీయ బొగ్గుగా పేర్కొన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్టీపీసీ చేపట్టిన థర్మల్ కేంద్రాల పెట్టుబడి వ్యయం, యూనిట్ వ్యయాన్ని ఒకసారి పరిశీలిద్దాం. ఏపీ విభజన చట్టంలో భాగంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్టీపీసీ రామగుండంలో నిర్మిస్తున్న స్థాపిత వ్యయం రూ.29,345 కోట్లు. ఇటీవల గ్లోబల్ టెండర్లు పిలిచిన ఈ థర్మల్ కేంద్రం ఉత్పత్తి వ్యయం మెగావాటుకు రూ.12.23 కోట్లు. గత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైటీపీఎస్ ఉత్పత్తి వ్యయం మొదటి రెండు యూనిట్లు పూర్తయ్యేసరికి మెగావాట్‌కు రూ.8.63 కోట్లుగా ఉన్నది. మిగతా యూనిట్లు పూర్తయ్యేనాటికి మెగావాటు ఉత్పత్తి వ్యయం సుమారు 9 కోట్లకు చేరుకోవచ్చని అంచనా. కాగా, యూనిట్ కరెంటు ధర ప్రభుత్వ వర్గాల ప్రకారం రూ.6.35 పైసలు. అదే సమయంలో సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన 1080 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో ఉత్పత్తి ప్రారంభించే నాటికి మెగావాట్‌కు రూ.9.74 కోట్లు. ఏటా తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు, డిమాండ్ గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా ప్రాజెక్టులను పూర్తిచేసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉన్నది.

ఝార్ఖండ్ విద్యుత్తు వితరణ్ నిగం లిమిటెడ్ (జేబీవీఎల్), నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్టీపీసీ)లు సంయుక్తంగా 2017లో ప్రారంభించిన పత్రాతు (PATRATU) థర్మల్ విద్యుత్తు కేంద్రాల పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. వాటితో పాటు ప్రారంభించిన వైటీపీఎస్ రెండు యూనిట్లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. గత కొంతకాలంగా నత్తనడకన సాగుతున్న వైటీపీఎస్ బ్యాలెన్స్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తే రోజుకు సుమారు 96 మిలియన్ యూనిట్ల విద్యుత్తు తెలంగాణ ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. 'అభివృద్ధి' అనే అంశం రాజకీయాలకు అతీతంగా నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియ. అది కొరవడినప్పుడు ప్రజలు పరాజితులుగానే మిగిలిపోతారు.

*యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు కేంద్రాల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం జరగడం, టెండర్లను అధిక రేట్లకు ఇవ్వడంతో రానున్న 25 ఏండ్లలో రాష్ట్ర ప్రజలపై రూ.14,140 కోట్ల అదనపు భారం పడనున్నదని ఇటీవల ప్రభుత్వం పేర్కొన్నది. ఇందులో రూ.9,697 కోట్లు యాదాద్రి భారంగా చెప్పుకొచ్చారు. మెగావాట్‌కు రూ.8.63 కోట్ల వ్యయమవుతున్న యాదాద్రి ప్రాజెక్టు వల్ల సుమారు 10 వేల కోట్ల భారం ప్రజల మీద పడనున్నప్పుడు మెగావాట్‌కు రూ.16.60 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రామగుండం థర్మల్ ప్లాంట్ వల్ల ఎంత నష్టం జరుగనున్నదో ఆలోచించాలి. భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు సంబంధించిన 320 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ జనరేటర్ కాలిపోయి 8 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు పునరుద్ధరించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యంగానే పరిగణించవచ్చు. దీనివల్ల డిమాండ్ ముంచుకొస్తున్న ప్రస్తుత తరుణంలో రోజుకు సుమారు 6.5 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తిని కోల్పోతున్నాం.*